

ఇక రెండు రోజులే

- కరెంట్ బిల్లుల భారం తగ్గించుకోండి
- అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు చివరి గడువు
- ఆ తర్వాత గుర్తిస్తే.. జరిమానాలు



నంద్యాల, జూన్28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ చూసినా ఇళ్ల విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కొందరు అనుమతి తీసుకున్న కిలో వాట్ కంటే అదనంగా వాడేస్తున్నారు. ఫలితంగా బిల్లుల మోత మోగుతోంది. ఇదే క్రమంలో వివిధ రూపాల్లో అదనపు చార్జీల రూపంలో భారం పెరుగుతోంది. చాలామంది వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో పెరిగిన బిల్లులను చూసి భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి, వినియోగదారులకు బిల్లుల మోత తగ్గించడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో అదనపు లోడ్ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ ఏడాది మార్చి 1వ తేది నుంచి జూన్ 30వ తేది వరకు డెవలప్‌మెంట్ చార్జీల్లో 50శాతం రాయితీ కల్పించింది. దీన్ని సద్వినియోగం చేసుకున్న వినియోగదారులందరికి అదనపు చార్జీల భారం తగ్గనుంది. గడువులోపు చేసుకోకుంటే.. అధికారుల తనిఖీల్లో గుర్తిస్తే జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏది ఏమైనా ప్రభుత్వ కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. లేకుంటే భవిష్యత్‌లో జరిమానాలతో పాటు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం ఆ శాఖ వర్గాల్లో ద్వారా తెలుస్తోంది.

జిల్లాలో 5,84,839 కనెక్షన్లు..


జిల్లా నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ పరిధిలో 5,84,839 (ఎల్‌టీలు) గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో చాలా మంది వినియోగదారులు అనుమతి తీసుకున్న కిలో వాట్ల కంటే ఎక్కువ విద్యుత్‌వాడేస్తున్నారని ఆశాఖ వర్గాల సమాచారం. ఏసీలు, మోటర్లు, హీటర్లు, విద్యుత్ స్టవ్‌లు, ఫ్రీజ్‌లు వంటి వినియోగం ఎక్కువగా వాడటమే కారణం. ఇందువల్ల వినియోగదారులకు బిల్లుల మోత మోగుతోంది.

వాడేది కొండంత....

ఎవరికైనా కొత్త కనెక్షన్ ఇచ్చే సమయంలో కిలోవాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు... రూ.2వేలు.. దుకాణాలకు.. రూ.2500 చొప్పున విద్యుత్ శాఖ అధికారులు వసూలు చేస్తారు. అయితే చాలా మంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలో వాట్ల లోపు చూపిస్తారు. కానీ.. రెట్టింపు విద్యుత్‌ను వినియోగించి పై కేటగిరిల్లోకి మారిపోతున్నారు. కొందరైతే కమర్షియల్ కనెక్షన్‌ల కంటే ఎక్కువగా వాడుతు న్నారని తెలిసింది.

ఈనెల 30వరకు 50శాతం రాయితీ..

నిబంధనలు ప్రకారం.. ప్రతి అదనపు కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా ప్రభుత్వం రూ. 200 నిర్ణయించింది. ఆయా వినియోగదారులు సైతం డెవలప్‌మెంట్ చార్జీల కింద రాయితీతో కొంత నగదు చెల్లించాలి. కిలో వాట్ పెరిగే కొద్ది రుసుం పెరుగుతుంది. ఒక కిలోవాట్‌కు సాధారణంగా దరఖాస్తు ఫీజు రూ.50, డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీ రూ. 1000 కట్టాలి. ఈ ప్రకారం ఎన్ని కిలోవాట్లు వరకు లోడ్ పెంచుకుంటే.. దరఖాస్తు మినహా మిగిలిన రెండు చార్జీల్లో రెట్టింపు చెల్లించాలి. అందులో డెవలప్‌మెంట్ చార్జీలపై 50శాతం రాయితీ వర్తించనుంది. కాబట్టి అర్హులైన వినియోగదారులు ప్రభుత్వం కల్పించి రాయితీని సద్వినియోగం చేసుకుని బిల్లుల మోత నుంచి తప్పించుకోవాలి.



రాయితీని వినియోగించుకోండి

ప్రభుత్వం కల్పించిన 50శాతం రాయితీకి ఇక రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. అదనపు భారం పడకుండా వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్, మీ సేవ, విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుని అమౌంట్ చెల్లించవచ్చు.

● సుధాకర్‌కుమార్, ఎస్ఈ, నంద్యాల



అదనపు లోడు	సాధారణంగా చెల్లించాల్సిన..	రాయితీ చెల్లించాల్సిన మొత్తం
1	2,250	1250
2	4450	2450
3	6,650	3650

ఆ ఇద్దరు..!

- ఐదేళ్లుగా చెట్టు కిందనే నివాసం
- వయసుకొచ్చిన కుమార్తెతో తల్లి దీనగాథ
- కూతురు చదువు కోసం పరితపిస్తున్న చిన్న రంగమ్మ
- దీనాస్థితిలో తల్లీకూతురు



చిన్న రంగమ్మ... యాభై ఏళ్ల వితంతు మహిళ. ఉన్న ఒక్కగానొక్క కుమార్తె కీర్తిబాయిని సంరక్షించుకుంటూ ఓ గోడ చాటున జీవనం సాగిస్తోంది. ప్రతినెలా వచ్చే రూ.4వేలు వితంతు పింఛన్‌తో తనతో పాటు కుమార్తె కడుపు నింపుకుంటోంది. పనిచేసే సత్తువ లేదు. పోనీ ఉందామంటే సెంటు జాగా లేదు. ఇన్నాళ్లు కుమార్తెను హాస్టళ్లలో ఉంటూ చదివించిన ఆమెకు ఇప్పుడు పెద్ద కష్టం వచ్చిపడింది. వయసుకొచ్చిన బిడ్డ ఇప్పుడు తనతో పాటు దీనావస్థ జీవితం గడపాల్సి వస్తోందంటూ చెబుతుండగా ఆమె కళ్ల నుంచి కన్నీటి సుడులు తిరిగాయి.



కీర్తి బాయి.. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతి. ఈ వయసులో మంచి చదువుతో పాటు స్నేహితులతో సరదాగా ఉండాలని, మంచి డ్రస్సులు వేసుకోవాలని, సంతోషంగా ఉండాలని ఎవరికైనా ఉంటుంది. ఉన్నంతలో సమాజంలో బాగా ఉండాలన్న తపన ఉంటుంది. కానీ ఈ యువతి పరిస్థితి ఇందుకు పూర్తి విభిన్నం. నిలువ నీడ లేదు, వసతి లేదు.. తల్లితో కలసి ఉంటూ యుక్తవయస్సులో పడరాని పాట్లు పడుతోంది. పేరులో కీర్తిని దాచుకున్న ఈమెకు నిజ జీవితంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా పోయాయి.

వివరాలు 6లో

లాడ్జీల్లో తనిఖీలు



లాడ్జీల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్ జూన్28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు లాడ్జీల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలు, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు లాడ్జీల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో క్షుణ్ణంగా పరిశీలించి వ్యక్తుల వివరాలు తెలుసు కున్నా మని, అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మొబైల్ సిస్టం ద్వారా ఎంక్వరీ చేసి వారి వివరాలను ఆరా తీశామన్నారు.



తాగునీటి కటకట

- 50 రోజులుగా సమ్మెలో మున్సిపల్ కార్మికులు
- ప్రత్యామ్నాయం అంతంత మాత్రమే
- ఇటీవలే నిరసన తెలిపిన మహిళలు
- బిందెడు నీటి కోసం బోలెడు కష్టాలు
- మంత్రి ఇలాకాలోనే ఎందుకిలా?

కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నగర జనాభా 6లక్షల పై మాటే.. రోజుకు 87 మిలియన్ లీటర్లు తాగునీరు అవసరం. 48 రోజులుగా నగరపాలక పరిధిలోని ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి కార్మికులు జీతాలు పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఎక్కువయ్యాయి. శివారు కాలనీల్లో రోజు విడిచి రోజు నీరు వస్తుంది. సమ్మె నేపథ్యంలో వారం రోజులకు ఒక్కసారి కూడ రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నగరపాలక పరిధిలో కార్మికులు సమ్మెలోకి వెళ్లడం ఏమిటని మేధావులు ప్రశ్నిస్తున్నారు. శివారు కాలనీలతో పాటు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం ఉస్మానియా కళాశాల సమీపంలోని లావుబాలిదర్గా వద్ద ఉండే స్థానిక ముస్లిం మహిళలు నెల రోజుల నుంచి తాగునీరు రావడం లేదని నగర పాలక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.



కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, బంగారుపేట, ఉస్మానియా కళాశాల, ఖండేరి, పెద్దపడఖానా, మాసుంబాష దర్గా, తెలుగువీధి, జొహరాపురం, పింజరి గేరి, గౌలిగేరి, బుధవారపేట, పూలబజార్, మండిబజార్ ప్రాంతాల్లో నీటి కష్టాలు అధికమయ్యాయి. నగర పాలక పరిధిలో 1.20లక్షల నివాసాలు ఉన్నాయి. 52 వార్డుల్లో 6లక్షలకు పైగా జనాభా వుంది. ఇప్పటికే శివారు కాలనీలు గణేష్‌నగర్, ధనలక్ష్మీనగర్, శరీన్‌నగర్, కృష్ణానగర్, లేబర్‌కాలనీలతో పాటు నగరంలో విలీనమైన స్టాంటన్‌పురం, మునగాలపాడు, మామిదాలపాడు, తదితర ప్రాంతాల్లో రెండు రోజులకు ఒక్కసారి కూడా తాగునీరు సరఫరా చేయడం లేదు. అదికూడా ఒక గంటకు మించి ఇవ్వడంలేదు. బిందెడు నీళ్లు దొరికితే చాలు మహాప్రభో.. దాహం తీర్చుకుం టాం అంటూ ఆయా కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, డబ్బు ఉన్న బడాబాబులు ఆర్వో ప్లాంట్ నుంచి 20లీటర్ల శుద్ధి చేసిన నీటి ట్యాంక్‌ను రూ.15-20లకు కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని పేదలు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతి సగటు జీవికి కుళాయి నీరే ఆధారం. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో తాగు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి.

మిగతా 6వ పేజీలో

సమస్యలను పరిష్కరించండి

● పంచాయతీ కార్యదర్శుల నిరసన



కలెక్టరేట్ ఆవరణలో బైఠాయించి నిరసన చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నంద్యాల నూనెపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల జిల్లా సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న పంచా యతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు పనిభారం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా ఆమెతో మాట్లాడారు. నంద్యాల డీఎల్‌పీవో రాంబాబును ఘటనాస్థలానికి పంపించారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ఆయన విన్నారు. డీఎల్‌పీవోకు వినతి పత్రం అందజేశారు.

సమస్యలు.. సవాళ్లు!

వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం

రైతులకు రూ.500 కోట్ల రుణాలు

7లో

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌కు అర్హులైన వారి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారంతో ముగిసినట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు. 120001 నుంచి చివరి ర్యాంక్ వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. మొత్తం 149 మంది విద్యార్థులు హాజరు కాగా, 124 మంది బాలురు, 25 మంది బాలికలు ఉన్నారు. నేటి నుంచి జరగాల్సిన వెబ్ ఆప్షన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 30వ తేదీకి వాయిదా వేశారు.

73 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఏపీ మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన పరీక్షకు 73 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మూడు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన పీజీటీ(లాంగ్వేజి)ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 514 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 73 మంది గైర్హాజరయ్యారు.

ఆ ఇద్దరు..!



ఇక్కడే చిన్నరంగమ్మ, కీర్తిబాయి ఉండేది...

మంత్రాలయం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గూడు చెదిరిన గువ్వలుగా మారారు ఆ తల్లీ కూతుళ్లు. ఐదేళ్లుగా బండలచాటున వండాల్సిందే.. చెట్టుకింద ఉండాల్సిందే. ఎవరో పెడితే గానీ కడుపు నిండదు. లేకపోతే పస్తులుండాల్సిందే. చదువుకోవాల్సిన కూతురు కూలికి వెళ్లి తల్లిని పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకెళితే.. మంత్రాలయం మండలం మాధవరం తండా 120 ఇళ్లు ఉండే గ్రామం అది. అందులో చిన్న రంగమ్మ (50), ఆమెకు కూతురు సుగాలి కీర్తిబాయి (18)... వీరు చెట్టుకిందనే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ, చలికి వణుకుతూ నివాసం ఉంటున్నారు. వీరికి ఎటువంటి ఆధారం లేదు. తులసప్ప, కిష్టమ్మల చిన్న కూతురు రంగమ్మ. ఈమెను కర్ణాటకలోని మాన్వితండాలోని గణేష్ అనే వ్యక్తితో వివాహం జరిపించారు. వీరికి కీర్తిబాయి పుట్టింది. వివాహమైన నాలుగేళ్ల తర్వాత భర్త మృతి చెందాడు. దిక్కులేని పరిస్థితుల్లో చంటి బిడ్డను ఒడిలో పెట్టుకుని రంగమ్మ సొంతగ్రామమైన తండాకు వచ్చింది. మూడేళ్ల అనంతరం వయసులో ఉన్న రంగమ్మను ఒంటరిగా ఉంటే బాగుండదని, ఆ గ్రామంలోని బంధువులు, పెద్దలు మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తండాకు చెందిన చంద్ర నాయక్‌కు ఇచ్చి రెండో వివాహం చేశారు. అయితే రెండేళ్ల కాపురం అనంతరం చంద్రనాయక్ కూడా మృతి చెందాడు. దిక్కుతోచని పరిస్థితుల్లో నాలుగేళ్ల కూతురును తీసుకుని పుట్టినిల్లయిన ఎం.తండాకు వచ్చింది. గ్రామంలో సొంత ఇల్లు లేదు. స్థలం లేదు.. పొలం కూడా లేదు. ఆపన్నహస్తం అందిస్తామన్న బంధువులు కూడా చేరదీయలేదు.

తెల్లవారుజాము స్నానం.. ఎందుకంటే..!

ఉండేందుకు నిలువ నీడ లేని రంగమ్మ, కీర్తిబాయిల కష్టాలు ఒక ఎత్తయితే... వారు స్నానం చేయడం, మరుగుదొడ్డికి వెళ్లాలంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. తెల్లవారుజామున ఎవరూ నిద్రలేయకనే బండల చాటున ఓ టార్పాల్ పట్ట అడ్డుగా చుట్టుకుని స్నానం చేయాలి. తర్వాత ఆ టార్పాల్ పట్ట గాలికి కొట్టుకుపోకుండా ఉండేందుకు తీసి మడతపెట్టి జాగ్రత్తపడతారు. ఇక ఇల్లే లేని వారు మరుగుదొడ్డికి మాత్రం ఊరి బయటకు వెళ్లాల్సిందే. అదికూడా ఎవరూ లేని సమయంలో చూసుకుని భయం భయంగానే. వయసులో ఉన్న ఆ యువతి ఇంతగా ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్కరూ జాలిచూపకపోవడం శోచనీయం. చేయి చాచి అడగలేని పరిస్థితి చిన్నరంగమ్మది. పుట్టిన ఊరిలోనే తనలో తాను కుమిలిపోతూ.. కూతురి విద్య దూరం అవుతుందన్న ఆవేదనతో ఎండకు, వానకు చలికి వణుకుతూ అష్టకష్టాలు పడుతున్నది. దాతలు, ప్రభుత్వ ఆపన్నహస్తం కోసం ఆ కుటుంబం ఎదురు చూస్తోంది.



చెట్టు కింద తల్లీ కూతుళ్లు

బీఎస్సీ నర్సింగ్ చేయాలని ఉంది



ఉండడానికి ఇల్లు లేదు. ఇంటి స్థలం, పొలం కూడా లేదు. చెట్టు కిందనే నేను, అమ్మ ఉంటున్నాం. బీఎస్సీ నర్సింగ్ చేయాలని ఉంది. చదువుకునేందుకు కరెంటు కూడా లేదు. ఎండ, వానలు, గాలికి నిరాశ్రయురాలుగా ఉన్నాము. రెండు రోజుల నుంచి రూ.250 పత్తి పొలంలో కలుపు మొక్కలు తీసేందుకు వెళ్తున్నా. పదో తరగతి వరకు మంచి మార్కులు సాధించాను. మాకు ఉండడానికి నివాసం, ప్రస్తుతం కాలం గడిపేందుకు నిత్యావసర సరుకులు దాతలు ఎవరైనా అందజేసి తనకు చదువుకునేందుకు ఆశ్రయం కల్పిస్తే చదువుకుని మా అమ్మను బాగా చూసుకుంటా.

\- కీర్తిబాయి

పదిలో ఫస్ట్ క్లాస్.. కానీ..

పుట్టినింటికి వచ్చిన్న రంగమ్మకు ఏమి చేయాలో తెలియని దీనస్థితిలో చెట్ల చాటున, గోడల మాటున జీవనం సాగిస్తూ తన కూతురు కీర్తిబాయిని చదివించాలన్న తపనతో అక్కడే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి వరకు చదివించింది. 5 నుంచి 10వ తరగతి వరకు బనవాసిలోని ఏపీఆర్‌జేసీ గురుకుల పాఠశాలలో చేర్పించింది. అక్కడ పదో తరగతి ప్రథమ శ్రేణిలో 488 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కీర్తికి చేయూతనిచ్చేవారు లేకపోవడంతో ఒక ఉపాధ్యాయుడి సలహాతో కర్నూలు బీ.క్యాంపులోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో బైపీసీలో ఇంటర్ పూర్తి చేసింది. ఇందులో అన్ని పాసైనప్పటికీ ఫిజిక్స్‌లో మాత్రం ఫెయిలై అమ్మతో పాటు ఉంటోంది. సప్లిమెంటరీలో సైతం రాసినా ఫెయిలైంది. ఒక వైపు మగదిక్కులేక, ఎలాంటి ఆదరణ లేని వారికి సభ్యసమాజంలో ఆదరించాల్సిన చేతులు కరువయ్యాయి. బీఎస్సీ నర్సింగ్ చేయాలన్న సుగాలి కీర్తిబాయి ఆశలు అడియాశలయ్యాయి. ఎన్టీఆర్ భరోసా రూ.4వేల పింఛన్‌తో రంగమ్మ బిడ్డకు పట్టెడన్నం పెడుతోంది. ట్రంకు పెట్టె, బట్టలు, కట్టెల పొయ్యి, రెండు స్టీల్ ప్లేట్లు, వండుకునేందుకు రెండు పాత్రలు, రెండు బిందెలు తప్పా వారివద్ద ఎలాంటి సామాన్లు లేవు.


తుంగభద్ర తీరం

సాహిత్యం

'ఏరా..! చిప్ దొబ్బిందా..?'

- ఆసక్తికరమైన బాలల సస్పెన్స్ నవల
- ప్రముఖ రచయిత పుల్లా రామాంజనేయులు విశిష్ట ప్రయోగం

కర్నూలు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆసక్తికరంగా చదివే పుస్తకాలు అరుదైపోతున్న తరుణంలో వారిలో కథల పట్ల ఆసక్తి, అభిరుచి, జిజ్ఞాస కలిగించే పుస్తకం 'ఏరా..! చిప్ దొబ్బిందా..?' నవల. ఈ నవలను కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత, సాహితీ పరిశోధకుడు పుల్లా రామాంజనేయులు రాశారు. వృత్తి రీత్యా స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) అయిన రామాంజనేయులు ప్రవృత్తి రీత్యా రచయిత. జిల్లా తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక ఒరవడి సృష్టించుకున్నారు. గతంలో ఆయన పిల్లల కోసం కథలు రాయడమే కాకుండా, పిల్లల చేత కథలు రాయించి, వాటిని పుస్తకంగా అచ్చువేశారు. జిల్లా సాహితీ ప్రపంచానికి బాల రచయితలను పరిచయం చేసిన ఘనత కూడా ఈయనకు దక్కుతుంది. అలాగే 'తోకలేని పిట్ట' అనే నవలను కేవలం పొడుపు కథలను మాత్రమే ఉపయోగించి ప్రయోగాత్మకంగా రాశారు. సుమారు 300 వరకు పొడుపు కథలతో కూడిన ఈ నవలకు 'అన్వేషిణి' అనే సంస్థ బహుమతి ప్రకటించి, అచ్చు వేయించింది. అలాగే ఒత్తులే లేకుండా బాలల కోసం ఒక నవల రాశారు. ఇది విమర్శకుల చేత ప్రశంసలు అందుకుంది. గతంలో గురజాడ జాతీయ సాహిత్య పురస్కారం అందుకున్న రామాంజనేయులు తన మూడో నవలగా'ఏరా..! చిప్ దొబ్బిందా..?' వెలువరించారు. ఇదొక సైంటిఫిక్ సస్పెన్స్ నవల మాత్రమే కాదు, మానవ సంబంధాలను, నేటి సమాజంలో మరిచిపోతున్న మానవీయ విలువలను గుర్తు చేస్తుంది. అన్నం పెట్టే రైతులు అప్పుల పాలు అవుతున్నా, ఆత్మహత్యలకు పాల్పడుతున్నా వారెందుకు భూమినే నమ్ముకొని జీవిస్తున్నారు..? అందుకు కారణాలు ఏమిటో ఈ నవల చర్చకు పెడుతుంది.



ఈ నవల్లో మురళి అనే తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి రైతు అయిన తన తండ్రిని కోల్పోతాడు. దీంతో ఒంటరిదైన తల్లి కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటుంది. చదువులో సాధారణ విద్యార్థిగా ఉండే మురళి కొన్నాళ్లు కనిపించకుండా పోయి, తిరిగి వచ్చిన తర్వాత అసాధారణ విద్యార్థిగా మారిపోవడం, చివరికి ఆ విద్యార్థి తన కలను సాకారం చేసుకున్నాడు. ఇదే ఈ నవల ప్రధాన కథాంశం. ఎంచుకున్న ఇతివృత్తం, అందుకు తగ్గట్టుగానే ఆకట్టుకునేలా కథన శైలి, మధ్య మధ్యలో వాట్సాప్‌లో మనం చదివిన కథలతో మానవ సంబంధాలను కాపాడాలనే తాపత్రయం, మొక్కలను పెంచి పర్యావరణ రక్షణ లాంటి సామాజిక అంశాలను స్పృశించడం వంటి ఉత్తమ లక్షణాలు ఈ నవలలో ఉన్నాయి. తరగతిలో ఎప్పుడూ పాఠ్యాంశాలే కాదు...వారిలో అంతర్లీనంగా ఉన్న సహజ ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలను నిర్వహించాలని కూడా ఈ నవల తెలియ జేస్తుంది. అలాగే హాస్య చతురోక్తులతో నవల సరదాగా నడుస్తుంది. ఆయా ప్రాంతాలు, దేశ నాయకులు, దేవుళ్ల విశేషాలు కూడా నవలలో ఉన్నాయి.

పిల్లలే కాదు, పెద్దలు కూడా చదవాల్సిన మంచి పుస్తకం ఇది. అన్ని పుస్తక విక్రయశాలల్లో అందుబాటులో ఉంది.



\- బి. రాణి లీలావతి, కర్నూలు

నేడు 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన

శ్రీకృష్ణ రాయబారం (పడక సీను)

కర్నూలు కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నెల నెలా నాటక ప్రదర్శనలు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు హైదరాబాదులోని విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ దర్శకుడు బీఎం రెడ్డి దర్శకత్వంలో ఈ నాటిక రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించిన ప్రతిచోటా పురస్కారాలు అందుకొని సంచలనం సృష్టించిందని అన్నారు. ఈ నాటికలో 'బలగం' సినిమా ఫేం నటి సురభి లలిత ఒక ముఖ్యపాత్రలో నటిస్తున్నారని తెలిపారు. అలాగే ఈ నాటిక ప్రదర్శనకు ముందు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో, కళాక్షేత్రం కళాకారులతో 'శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) సన్నివేశం ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఇందులో శ్రీకృష్ణుడిగా భాస్కర్ యాదవ్, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ చౌదరి, అర్జునుడిగా కేవీ రమణ నటిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ పి. రాజారత్నం, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియా తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- మతసామరస్యానికి నిదర్శనం
- కులమతాలకతీతంగా నిర్వహణ
- ముస్తాబైన పీర్ల చావిడిలు
- పలు గ్రామాల్లో కొలువుదీరిన పీర్ల స్వాములు



చావిడిలో కొలువుదీరిన పీర్లస్వాములు

కొలిమిగుండ్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా మొహర్రంను నిర్వహిస్తారు. జిల్లాలో పీర్లపండుగ(మొహర్రం) పెద్దఎత్తున ప్రారంభమైంది. కర్బలా మైదానంలో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ ముస్లింల్లోని ఓవర్గం మొహర్రంను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం మొదటి మాసాన్ని మొహర్రం నెలగా భావిస్తారు. ఈమాసంలోనే పది రోజులు పవిత్ర దినాలుగా భావిస్తూ మొహర్రం నిర్వహిస్తారు.

హిందూ ముస్లింలు కలిసిమెలిసి..

పూర్వకాలం నుంచి హిందూ ముస్లింలు కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పర్వదినానికి గ్రామాల్లో ఎంతో ప్రత్యేకత ఉంది. పట్టణాలు, గ్రామాలు అన్నతేడా లేకుండా వారం రోజుల పాటు హిందూ ముస్లింలు భాయి.. భాయి.. అంటూ మొహర్రం పర్వదినంలో పాల్గొని పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముస్లింలకు సంబంధించిన ఏపర్వదినానికి లేనివిధంగా మొహర్రం (పీర్ల పండుగ)ల్లో హిందువులు పెద్దఎత్తున పాల్గొనడం ప్రత్యేకతగా నిలుస్తుంది. జిల్లాలోని అనేక గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

మొహర్రం చరిత్ర

క్రీ.పూ 650లో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ దేవుడి కోసం యజిద్‌పై పోరాడి అసువులు బాశారు. నాటి నుంచి త్యాగానికి ప్రతీకగా మొహర్రం పర్వదినాన్ని జరుపుకుంటున్నారు. వారు వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగంచేసిన గుర్తుగా, వారిని జ్ఞాపకం చేసుకుంటూ పీర్ల స్వాములను ఊరేగిస్తారు. తెలుగువారు గ్రామీణ ప్రాంతాల్లో ఈపండుగను పీర్లపండుగ అని పిలుస్తారు. పల్లెలతో పాటు, పట్టణాల్లో సైతం పీర్లచావిడిలను అందంగా ముస్తాబు చేస్తారు. తొమ్మిదిరోజుల పాటు పూజలు, ప్రార్థనలు, ఊరేగింపులు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ముస్లింలతో పాటు, హిందూ భక్తులు పీర్ల స్వాములకు కపడాలు, పూల దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. పీర్ల స్వాముల ఊరేగింపులో అగ్నిగుండం ప్రవేశం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పీర్ల స్వాముల నిమజ్జనంతో పీర్ల పండుగ ముగుస్తుంది.

ఎల్లెల్సీకి ముందస్తు సాగునీరు

- ఖరీఫ్‌కు మాత్రమే
- పనులు పూర్తి చేయాలని బోర్డు అధికారుల ఆదేశం



ఉప్పొంగుతున్న తుంగభద్రమ్మ

హాలహర్వి, జూన్28(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నీటి నిల్వ 62 టీఎంసీలు దాటిపోయింది. వరద ఉధృతి 63,816 క్యూసెక్కులు. మరో రెండు రోజుల్లో 80 టీఎంసీలకు నీటి నిల్వ చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జలాశయంలో 80 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకుని, మిగతా వరద నీటిని నదికి విడుదల చేసేందుకు బోర్డు అధికారులు సిద్ధమయ్యారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఈ యేడాది మే నెలలోనే ఇన్‌ఫ్లో ప్రారంభం కావడంతో జూన్ ఆఖరికి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరబోతుంది. కానీ క్రస్ట్‌గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో జలాశయం నీటి నిల్వ 80 టీఎంసీలకు మించకూడదనే బోర్డు అధికారుల నిర్ణయంతో ఈసారి ముందస్తుగానే కాలువకు నీరు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కర్ణాటక రాష్ట్ర జలవనరుల మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఏఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. కర్నూలు జిల్లాలో 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎల్లెల్సీ కాలువకు ముందస్తుగా సాగునీరు అందుతుంది. ముందస్తుగా సాగునీరు విడుదలవుతున్న నేపథ్యంలో సీసీ లైనింగ్ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లపై బోర్డు అధికారులు ఒత్తిడి పెంచారు. దీంతో పనులు వేగవంతం అవుతున్నాయి. తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు ఉండగా, ప్రస్తుతం 1622 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 63,816 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది.

తాగునీటికి కటకట

5వ పేజీ తరువాయి

మంత్రి ఇలాకాలో ఇదేమిటని..

తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. ఎలాగైనా సమ్మెను విరమించి విధుల్లోకి చేరాలని నగరపాలక అధికారులు కార్మికులను బెదిరించడంతో పాటు నోటీసులు జారీ చేస్తున్నారు. మంత్రి ఇలాకాలో ఇలా జరగడమేమిటని కొందరు విస్తుపోతున్నారు. మంత్రి చొరవ తీసుకుని సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే అవకాశముంది. రాష్ట్రంలోని 75శాతం నగర పాలక, మున్సిపాలిటీల్లో మాత్రమే కార్మికులు సమ్మెలో ఉన్నారు. మిగిలిన 25శాతం మున్సిపాలిటీల్లో కార్మికులు యథావిధిగా విధులు నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం, అనంతపురం జిల్లా తాడిపత్రిలో కార్మికులు విధుల్లో కొనసాగుతున్నారు. మంత్రి ఉన్న ప్రాతనిధ్యం వహిస్తున్న కర్నూలు నగర పాలకలో కార్మికులు సమ్మె చేపట్టారు.

ఓ అధికారి బెదిరింపులు

నగర పాలక కార్యాలయంలో ఓ అధికారి కార్మికులను తన చాంబర్‌కు పిలిపించుకుని బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రజలకు సకాలంలో సేవలను అందించడానికి కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని, అలా చేరక పోతే కొత్తవ్యక్తులను నియమించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆ అధికారి కార్మికులను హెచ్చరించారు. ప్రజలకు ప్రాథమిక సేవలను అందించడంలో అంతరాయాలను నివారించడానికి గైర్హాజరైన వ్యక్తుల స్థానంలో వారిని అప్కాస్‌లో నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

బోరింగులే దిక్కు..

నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు బోరింగులను ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు ప్రైవేటు ట్యాంకర్లను రూ.400 నుంచి రూ.500 వెచ్చించి తెప్పించుకుంటున్నారు. ఈ లెక్కన కార్మికులు సమ్మె విరమించకపోతే ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యే ప్రమాదముంది.

అంతంత మాత్రంగానే..

ప్రత్యామ్నాయ చర్యలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. అశోక్‌నగర్‌లోని నీటి శుద్ధికేంద్రంలో సుమారు 30 నుంచి 40 మంది కార్మికులు పని చేసేవారు. అందరూ సమ్మెలోకి వెళ్లడంతో 12మంది ప్రైవేటు వ్యక్తులతో నీటి శుద్ధి కేంద్రంలో పని చేయించుకుంటున్నారు. 52 వార్డులకు 8మంది ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, 15 మంది మోటార్ ఫిట్టర్లు, 70 మంది కుళాయి టర్న్ కాకర్లు(వీళ్లు నగరంలో ప్రతి వీధిలో వాల్వ్ ఓపెన్ అండ్ క్లోజ్ చేసే వాళ్లు). వీరంతా సమ్మెలో ఉన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా ప్రైవేటు వ్యక్తులకు తీసుకుని వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే ఇదంతా చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అరకొరగా ట్యాంకర్లను..

నగరంలోని కొన్నిప్రాంతాలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పూర్తిగా తాగునీటి కష్టాలు ఎక్కువగా ఉండే నగరంతో పాటు శివారు కాలనీలకు అరకొరగా ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రధానంగా ట్యాంకర్ల డ్రైవర్లు కూడా సమ్మెలోకి వెళ్లడంతో ప్రైవేటు వ్యక్తులను వినియోగించుకుంటున్నారు.

విధుల నుంచి తొలగిస్తాం



ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే విధుల తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులంతా సమ్మెలో ఉన్నారు. ప్రత్యామ్నాయంగా ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులు, డీఈలు, ఏఈలు, అమ్యూనిటీస్ సెక్రటరీలతో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. లేబర్ పని చేసేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులను రోజువారి కూలీ ఇచ్చి పనులు చేయించు కుంటున్నాం. కార్మికుల డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. కార్మికులు విధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

● ఎస్.రవీంద్రబాబు, కమిషనర్, కర్నూలు నగరపాలకసంస్థ

బోరింగ్ నుంచి తెచ్చుకుంటున్నాం



తాగునీరు సకాలంలో రాకపోవడంతో దూరంలో ఉన్న బోరింగ్ నుంచి తెచ్చుకుం టున్నాం. ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పన్నులు అయితూ వసూలు చేస్తారు. మరి నీరు వదలడంలో మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

● మునెమ్మ, కల్లూరు కాలనీ

గంటల తరబడి ఎదురుచూస్తున్నాం



తాగునీరు ఎప్పుడు వదులుతారో తెలియదు.. ఎంతసేపు వస్తాయో తెలియక గంటల తరబడి ఎదురుచూస్తున్నాం. ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ఒక ఇంటికి నీరు వస్తే నాలుగు ఇళ్లకు రావడం లేదు.

● రామమ్మ, కొత్తపేట, కర్నూలు

నెలరోజులుగా తాగునీటి కోసం..



నెల రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. చివరికి ఇంట్లో పెద్దవాళ్లు పనుల కోసం బయటికి వెళ్లిపోతే ఇంట్లో ఉండే చిన్నారులతో నీటిని తెప్పించుకుంటున్నాం. ముస్లిం మహిళలు బయటికి రాకపోయినా కూడా నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చింది.

సయ్యద్ రహీమున్నీసా, లతీఫ్‌లావుబాలీ దర్గా ప్రాంతవాసి

నీళ్ల సమస్య లేని కాలనీల్లో కూడా..



నగరంలో ఎప్పుడూ నీళ్ల సమస్య లేని కాలనీల్లో ఇప్పుడే ఎందుకు వచ్చింది. నీళ్ల ట్యాంకు, నగరపాలక సంస్థ కార్యాలయానికి సమీపంలో ఉన్న కాలనీల్లో కూడా తాగునీటి సమస్య వస్తుంది. కొన్ని కాలనీల్లో ఒక ప్రాంతానికి ఎక్కువ ఒక ప్రాంతానికి తక్కువ నీరు సరఫరా అవుతుంది. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కూడ అందించకపోతే ఎలా?

● ఇరిగినేని పుల్లారెడ్డి, పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

సమస్యలు.. సవాళ్లు!

- వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం
- వైసీపీ సభ్యులు వర్సెస్ టీడీపీ ప్రతినిధులు
- పలు పథకాలపై రచ్చరచ్చ



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకోసారి జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం గందరగోళంగా మారింది. ఎక్కువసేపు సవాళ్లు విసురుకున్న ప్రజాప్రతినిధులు కాసేపు ప్రజాసమస్యలను ప్రస్తావించారు. అయితే ఒకరిపై ఒకరు దూషణలు చేసుకోవడం, ఆరోపణలు చేసుకోవడానికే అధిక సమయం కేటాయించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయం, వైద్య-ఆరోగ్యం, జిల్లా పంచాయితీ శాఖ, విద్యాశాఖల అంశాలపై సర్వసభ్యసమావేశం నిర్వహించారు.



సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, రాజకుమారి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఎమ్మెల్సీ మధుసూదన్, సీఈఓ జి.నాసర రెడ్డి, డిప్యూటి సీఈఓ వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకనే ప్రజలు ఇంటి వద్ద కూర్చోబెట్టారని ఎమ్మెల్యే అన్నారు. దీంతో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో హామీలన్నీ అమలు చేశామని, ప్రస్తుతం ఎలాంటి హామీలు అమలు చేయలేదన్నారు. 'నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని, బహిరంగ చర్చకు సిద్ధమా? బయటకు పోదాం.. దమ్ముంటే బయటకు వచ్చి నా సవాల్‌ను స్వీకరించండి..' అంటూ ఎమ్మెల్యే పార్థసారథి విరుచుకుపడ్డారు. విద్యాహక్కు చట్టం కింద ఉచితంగా సీట్లు ఇవ్వని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలి
- మంత్రి టీజీ భరత్

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు వాడుకునేలా అవగాహన కల్పించాలి. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. డ్రోన్ స్ప్రేయర్ వల్ల కలిగే ప్రయోజనాలు, లబ్ధి గురించి మండల వ్యవసాయ అధికారుల రైతులకు అవగాహన కల్పించాలి. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం సక్రమంగా అమలయ్యేలా విజిలెన్స్ కమిటీని వేసి పర్యవేక్షించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అంశంలో లక్షలు, కోట్లు ఖర్చు పెడుతున్నారు. అంత ధర ఉందా వెరిఫై చేయాలి. ఆసుపత్రిల్లో తదితర విభాగాలకు సంబంధించిన ముఖ్యమైన పరికరాలను ఏఎంసీలో కాకుండ సీఎంసీలో తీసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 20 నుంచి 25 సంవత్సరాలు దాటిన పాఠశాల భవనాల స్థితిని తనిఖీ చేయించాలి. హంద్రీ నది మొదటు నుంచి పాతబస్తీ చివర తుంగభద్రలో కలిసే వరకు పూడిక బాగా పెరిగిపోయింది. పూడికతీత తీయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- అఖిలప్రియ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేసీ కెనాల్‌ను ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండ శిల్పా వెంచర్ వేశారు.



అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కేసీ కెనాల్‌ను పూర్తిగా పూడ్చేసారు. దీంతో పక్కనే ఉన్న 7 వేల ఎకరాలకు నీరు అందడం లేదు. ఈ విషయంపై మూడు సార్లు అసెంబ్లీలో మాట్లాడాను. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సీఎం కార్యాలయం నుంచి సీరియస్‌గా అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేసులు పెడతారా..లేదా..? ఆక్రమించుకుని వేసి వెంచర్‌లో నష్టపోయిన వారికి కోర్టు ఉత్తర్వుల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలి. పొగాకును సకాలంలో కొనుగోలు చేయాలి. తల్లికి వందనం సంబంధించి సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలి. బ్యాంకర్లు తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాలో పడితే ఇతర అప్పుల కింద జమ చేసుకుంటున్నారు. దీనిపై కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలను బ్యాంకర్లకు ఇవ్వాలి.



ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ... పండ్ల తోటలకు సంబంధించి రైతులకు అవగాహన సక్రమంగా కల్పించడం లేదన్నారు. తాను 30 ఎకరాల్లో పండ్ల తోటలను వేశానని, ఇప్పటి వరకు ఏ అధికారి కూడా రాలేదు అన్నారు.



కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ... జిల్లాలో సాగవుతున్న పండ్ల తోటలను అధికారులు పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. సి. బెళగల్ మండలంలో సీడ్ పత్తి సాగు అంశంపై వెరిఫై చేయాలన్నారు. మెగా డీఎస్సీకి సంబంధించిన పరీక్షలు జూలై 2నాటికి పూర్తయి, జూలై 15 నాటికి ఫలితాలు వస్తాయి. అనంతరం టీచర్ల ఖాళీగా సంబంధించిన సమస్య ఉండదు. జిల్లాలో కొత్తగా ఆరు బీసీ హస్టల్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, కొత్తగా రెండు హస్టలను ప్రారంభించామన్నారు.



నంద్యాల కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ... నంద్యాల జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. జిల్లాలో ప్రస్తుతం 9,339 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ ఉందన్నారు. రైతులకు ఉచితంగా అందజేయాల్సిన మినీ కిట్లకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ చేయించామని, మినీ కిట్లను అమ్మలేదని విచారణలో తేలిందన్నారు. 3 పొగాకు కంపెనీలతో మాట్లాడి వారితో పొగాకు కొనుగోలు చేయించామన్నారు.

సంతోష్‌నగర్‌లో భారీ చోరీ

కర్నూలు క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సంతోష్ నగర్‌లో ఆషియానా అపార్టుమెంటులో భారీ చోరీ జరిగింది. అఫ్జల్ పర్వేజ్ అనే వ్యక్తి ఇంట్లో సుమారు 18 తులాల బంగారు నగలు, రూ.5 లక్షల నగదు చోరీ చేశారు. వెలుగోడు ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహించే పర్వేజ్ ఈ నెల 24వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాదు వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూస్తే తలుపులు తెరిచి వున్నాయి. ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు చోరీ అయినట్లు గుర్తించారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ విక్రమసింహాలు అపార్టుమెంటుకు వెళ్లి పరిశీలించారు. క్లూజ్ టీం వివరాలు సేకరించాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విక్రమసింహ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ... ఒకరి దుర్మరణం

ప్యాపిలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామం సమీపంలో శనివారం చోటు చేసుకుంది. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన కుమార్‌నాయక్(28) బైకుపై పని నిమిత్తం పాణ్యం మండలంలోని నెరవాడ గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి సొంత ఊరికి బయలు దేరాడు. మార్గం మధ్యలోని జలదుర్గం గ్రామం దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో కుమార్‌నాయక్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

ఓర్వకల్లులో బస్సు ఢీకొని...

ఓర్వకల్లు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా మినీ టూరిస్టు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని జాతీయరహదారి-40పై హుసేనాపురం బస్‌స్టేజీ వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఓర్వకల్లు మండలంలోని తిప్పాయపల్లె గ్రామానికి చెందిన బాలస్వామి హుసేనాపురం సమీపంలో శనివారం రోడ్డు దాటుతున్నాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి తిరుపతికి వెళ్తున్న మినీ టూరిస్టు బస్సు ఢీకొనడంతో బాలస్వామి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేశారు. మినీ టూరిస్టు బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సబ్ స్టేషన్ వద్ద ప్రమాదం


- ముగ్గురికి గాయాలు

కోడుమూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం సమీపంలో టెలిగేన్స్ పవర్ కం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన 33 సబ్ స్టేషన్ వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరగగా ఆలస్యంగా వెలుగులోకి ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. వివరాలు.. టెలిగేన్స్ పవర్ కంపెనీలో సుమన్ రే, ఇంజనీర్ రవిశంకర్ కుష్వా, జితేంద్ర కన్నోజియా అనే ముగ్గురు నెంబర్-1 ఫిట్టర్ వద్ద తనిఖీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణానికి చెందిన ఖాజాహుసేన్ అనే యువకుడు శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వరుసకు అత్తకూతురితో ఖాజాహుసేన్‌కు నిశ్చితార్థం జరిగింది. ఆ తర్వాత రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు రావడంతో పెళ్లివద్దనుకున్నారు. అయితే అంతకుముందు దిగిన ఫొటోలను ఖాజాహుసేన్ సోషల్‌మీడియాలో పోస్టుచేస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 21వతేది పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కాగా తన బ్యాంకు ఖాతా నుండి తనకు తెలియకుండా డబ్బును డ్రా చేశాడంటూ 26వ తేదీన మరోసారి యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణకు మరోసారి ఖాజాహుసేన్‌ను పోలీసులు పిలిచారు. తాను డబ్బు డ్రా చేయలేదని ఖాజాహుసేన్ పోలీసులకు విచారణలో చెప్పుకున్నాడు. శనివారం ఖాజాహుసేన్ తిరిగి పోలీసు విచారణకు వెళ్లాల్సి ఉండగా ఉండగా ఇంటి వద్ద విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అమ్మాయి ఫిర్యాదులతో మనస్తాపానికి గురై ఖాజాహుసేన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

చెక్‌పోస్టులో రూ.39 లక్షలు సీజ్



మాధవరం చెక్‌పోస్టులో సీజ్ అయిన డబ్బు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు ఎక్సైజ్ ఎస్ఐ రమణారెడ్డి, ఎమ్మిగనూరు ఎక్సైజ్ ఎస్ఐ రాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆదోనికి చెందిన దుర్గ ఆయిల్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్న నాగరాజు కర్ణాటకలోని రాయచూరు నుంచి రూ.39 లక్షల నగదు బ్యాగులో ఉంచుకుని కర్ణాటక బస్సులో ఆదోని వెళ్తున్నాడు. మాధవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేసి పట్టుకున్నారు. స్థానిక మాధవరం పోలీస్ స్టేషన్ లో పంచనామా నిర్వహించి పట్టుబడిన నగదుకు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఆదోని ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పజెప్పారు.

బదిలీ కావాలా నాయనా..!

బదిలీలలో చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది

కర్నూలు కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బదిలీలు కావాలంటే పైసలివ్వాల్సిందే.. ఇదీ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ సిబ్బంది పని తీరు. చేతులు తడిపితే కానీ అక్కడ పనులు జరగని పరిస్థితి. కాని పరిస్థితి ఉంది. ప్రతి పనికి ఒక నిర్ణీత ధరను నిర్దేశించి పనిచేసే వ్యవస్థ అక్కడ పాతుకుపోయి ఉంది. పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై ఫలానా ఉద్యోగిని కలిస్తే వారే మార్గదర్శకత్వం వహిస్తారని ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. చేతులు తడపకుంటే పనులు జాప్యం చేయడం అనే జాడ్యం ఇక్కడ స్థిరపడి ఉంది. ఇటీవల కొందరు పంచాయతీ కార్యదర్శులు గ్రూప్ 2 పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. వారి సర్టిఫికేట్ల పరిశీలనకు డీపీవో కార్యాలయం నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం కార్యాలయ సిబ్బంది ఒక్కో పంచాయతీ కార్యదర్శి నుంచి రూ.5వేలు చొప్పున ముక్కు పిండి వసూల్లు చేస్తున్నట్లు సమాచారం. కొందరి నుంచి బలవంతంగా ఫోన్‌పే ద్వారా వసూలు చేసినట్లు తెలిసింది. ఇటీవల గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 పదోన్నతుల అంశంలో కూడా ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శి రూ.10వేల చొప్పున వసూలు చేసి ముడుపులు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది బదిలీల సందర్భంగా డీపీవో కార్యాలయ సిబ్బంది విపరీతమైన అవినీతికి తెరలేపారు. వారు చేసిన పాపానికి అప్పటి డీపీవో ఇబ్బందులో పడాల్సి వచ్చింది. ఆ సిబ్బందిలో కొందరిని ఆదోని డీఎల్‌పీవో కార్యాలయానికి బదిలీ వేటుపై పంపారు. కర్నూలు డీపీవో కార్యాలయం అవినీతికి కేంద్ర బిందువుగా మారిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.



డిప్యుటేషన్లకు కేంద్ర బిందువుగా..

ఇప్పటికే డీపీవో కార్యాలయంలో సిబ్బంది ఉండాల్సిన సంఖ్య కన్నా అధికంగా ఉన్నారు. డిప్యూటేషన్ అనే కారణంగా కర్నూలుకు వచ్చి డీపీవో కార్యాలయాన్ని పునరావాస కేంద్రంగా మార్చారు. ఇచ్చిన చోట పని చేయకుండా కేవలం కర్నూలులోనే పని చేస్తామని కొత్త నిబంధన లిఖించుకున్నారు. ఐదేళ్లు కర్నూలు డీపీవో కార్యాలయంలో పని చేయడం, తర్వాత డీఎల్‌పీవో కార్యాలయాలకు బదిలీపై వెళ్లి డిప్యుటేషన్ సాకుతో మళ్లీ కర్నూలులోనే మకాం వేయడం పరిపాటిగా మారింది. సొంత మండలం, సొంత డివిజన్ అనే నిబంధనలు వీరికి వర్తించకపోవం గమనార్హం.

జిల్లా అధికారులు వత్తాసు పలకడం..

గ్రేడ్-2 వీఆర్వోల బదిలీల కోసం శనివారం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, రిక్వెస్టు బదిలీలపై వారు మూడు ప్రాంతాలను ఆప్షన్స్ ఎంచుకున్నారు. బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న ఉద్యోగులు తమ శాఖకు చెందిన మండల స్థాయి అధికారులతో జిల్లా స్థాయి అధికారులతో ముందస్తు సంప్రదింపులు జరపడం గమనార్హం.

ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాం

ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలు నిర్వహిస్తున్నాం. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి బదిలీ తప్పనిసరి. డిప్యూటేషన్ల దరఖాస్తులను అనుమతించడం లేదు. ఉద్యోగులను వేధించే ఆఫీసు సిబ్బంది ఎవరైనా ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

● భాస్కర్, డీపీవో, కర్నూలు

రైతులకు రూ.500 కోట్ల రుణాలు

- రుణ బకాయిలు తొందరగా రాబట్టండి
- జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతులకు ఈ సంవత్సరం రూ.500 కోట్ల కొత్త రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన సిందూర్ డిపాజిట్ పథకం ద్వారా రూ.50 కోట్లను రాబట్టాలని నిర్ణయించామని, దీనికి ప్రతి ఒక్కరూ సపోర్ట్ చేయాలని కోరారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాల్లో కేవలం 19 సహకార సంఘాలు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు అర్హత పొందాయని, మిగిలిన సంఘాలు వీలైనంత తొందరలో బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. సహకార కేంద్ర బ్యాంకు, సంఘాలు, సంఘాల్లోని సిబ్బంది ప్రతి ఒక్కరూ బ్యాంకులు, సంఘాలను బలోపేతం చేయడంతో పాటు రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనాలు అందించేందుకు కృషి చేయాలని చైర్మన్ స్పష్టం చేశారు. ఈ సంవత్సరం వ్యాపారాన్ని రూ.4వేల నుంచి రూ.4,500 కోట్లను రాబట్టేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల డీసీవోలు వెంకటకృష్ణ, రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ ప్రతినిధి దినేష్, జిల్లాలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు, చేనేత సహకార సంఘాల చైర్మన్లు, సిబ్బందితో పాటు డీసీసీబీ జీఎం శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ ఆందోళనకరంగా మారింది. శనివారం జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగలేదని సచివాలయ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులపై విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశంచేసి ఉద్యోగులను సముదాయించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 728మంది ఉండగా.. అందులో 477 మంది ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, మిగిలిన మెడికల్ గ్రౌండ్స్, స్పౌజ్‌లు ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గొడవ పడుతున్న సందర్భంలో పీఆర్ ఎస్‌ఈ వి.రామచంద్రారెడ్డి కలగజేసుకుని బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొనడంతో ఉద్యోగులు చల్లబడ్డారు. ఈ క్రమంలో రాత్రి 9 గంటల వరకు ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

మహిళా పోలీసులకు బదిలీలు

కర్నూలు క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియను చేపట్టారు. ఈ కౌన్సెలింగ్‌కు మొత్తం 839 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం ర్యాంకింగ్ ప్రకారం పిలిచి పారదర్శకంగా బదిలీలు నిర్వహించారు. బదిలీలు కోరుకునే ఉద్యోగిని గ్రామ వార్డు ఉండే సచివాలయం మినహా ఇతర సచివాలయాలను ఎంపిక చేసుకునే విధంగా, ఖాళీల వారిగా ఉన్న సచివాలయాల ఆప్షన్లను కంప్యూటర్ డిస్‌ప్లే ద్వారా తెరపై చూపించారు. అందులో నచ్చిన సచివాలయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. విజువల్ చాలెంజ్ (దృష్టి లోపం, అంధత్వం), మెంటల్లీ డిసేబుల్డ్ (మేధో వైకల్యం), ట్రైబ్స్, దివ్యాంగులు, మెడికల్, స్పౌజ్, జనరల్ తదితరుల సమస్యల ప్రాతిపదికను పరిగణనలోకి తీసుకుని ధృవీకరణ పత్రాలను వైద్యుల పర్యవేక్షణలో నిజ నిర్ధారణ చేసుకుని బదిలీలు చేపట్టారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్స్ ప్రకారం ట్రాన్స్‌ఫర్ ప్రొసీడింగ్స్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు అడ్మిన్ హుశేన్ పీరా, ఎస్పీ కృష్ణమోహన్, మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసాచారి, పోలీస్ వెల్ఫేర్ డా. స్రవంతి తదితరులు ఉన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల

పేరుతో మోసం

జూపాడుబంగ్లా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ సేఫ్టీ ఆఫీసరంటూ ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసి పరారైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. జూపాడుబంగ్లాలో శనివారం ఖాజాహుస్సేన్ అని వ్యక్తి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అని ఐడెంటీకార్డును చూపించి వ్యాపారులను బోల్తా కొట్టించాడు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసరంటూ హోటళ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్ దుకాణాలు తనిఖీలు నిర్వహించాడు. లైసెన్సులు తీసుకోవాలని లేకపోతే దుకాణాలు మూసేయాలని హల్‌చల్ చేశాడు. లైసెన్స్ కోసం ఒక్కో దుకాణానికి రూ.1500 అవుతుందని చెప్పాడు. అడ్వాన్స్‌గా ఒక్కొక్కరి వద్ద రూ.500 తీసుకున్నాడు. ఖలీల్ అనే కూల్‌డ్రింక్ దుకాణదారుడికి అనుమానం వచ్చి నంద్యాల జిల్లా ఫుడ్ ఆఫీసర్ రాముడు కదా అని చెప్పడంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాముడును వివరణగా కోరగా లైసెన్సులు ఇవ్వాలంటే ముందుగా దుకాణదారులతో సమావేశం నిర్వహించి నిబంధన గురించి అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి వ్యక్తులను వ్యాపారులు నమ్మొద్దని వివరించారు.

అన్నదాన పథకానికి విరాళం


అన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న చక్రపాణి

ఆత్మకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి కరివేన గ్రామానికి చెందిన రేషన్ డీలర్ మామిళ్లపల్లె చక్రపాణి, లక్ష్మీదేవమ్మ దంపతులు తమ తల్లిదండ్రులు పుల్లయ్య, నాగలక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.1,02,116 విరాళం అందజేశారు. శనివారం ఆలయ కమిటీ ఛైర్మన్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, అన్నదాన కమిటీ ఛైర్మన్ రామయ్యకు నగదును అందజేశారు. ఆలయ కమిటీ వారు దాతలను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా అర్చకులు వారికి స్వామి, అమ్మవార్ల వేదాశ్వీరచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అన్నదాన కమిటీ కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి జక్కామురళి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ, అర్చకులు అనిల్‌కుమార్ ఉన్నారు.

పంట కాలువలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం ఎత్తిపోతల పథకంలో భాగంగా పూర్తి ఆయకట్టుకు పంట కాలువలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మాబాషా, వీరన్న డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభ సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్దాపురం ఎత్తిపోతల పథకం పరిధిలోని 24వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించినట్లు చెప్పారు. అయితే పదేళ్లు కావస్తున్నా ఇంతవరకు పంటకాలువలు పూర్తి కాలేదని అన్నారు.

పోరాటాలకు ప్రజలు సహకరించాలి: సీపీఐ

ఆత్మకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పోరాటాలకు ప్రజలు విరాళాలు ఇచ్చి సహకరించాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు, తాలుకా కార్యదర్శి టి.ప్రతాప్ కోరారు. శనివారం ఆ పార్టీ నాయకులు పట్టణంలో పర్యటించి ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇదిలావుంటే జూలై 6వ తేదిన జరిగే ఆత్మకూరు మండల సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభల నిర్వహణకు ప్రజలు ఆర్థిక సహకారం అందించాలని పిలుపునిచ్చారు. చాంద్, లల్లు, షేక్షావలి, బాషా, నాగన్న, జాకీర్ ఉన్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన మహిళ

నంద్యాల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన తెలుగు అమ్మమ్మ శనివారం క్షేమంగా ఇంటికి చేరింది. పోలీసుల వివరాల మేరకు తెలుగు అమ్మమ్మ తన అల్లుడు మనవడితో కలిసి ఈనెల 27 వతేదిన నల్లమల అడవిలోని మల్లమ్మ కన్నీర్ వైపు వంట చెరకు కోసం వెళ్లి తప్పిపోయారు. అడవిలో తప్పిపోయిన అమ్మమ్మ గురించి బంధువులు శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ప్రసాదరావు సిబ్బందితో, ఫారెస్ట్ సిబ్బందితో కలిసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. శనివారం ఫారెస్ట్ బీట్ అధికారి ఠాగూర్, ప్రొటెక్షన్ వాచర్లు, అమ్మమ్మ బంధువులు గాలిస్తుండగా మద్యగుడి వద్ద ఆచూకీ కనుగొన్నట్లు తెలిపారు. అమ్మమ్మను క్షేమంగా ఇంటికి చేర్చినట్లు తెలిపారు. ఫారెస్ట్ పోలీస్ అధికారులను ఆయన అభినందించారు.

పనిభారం తగ్గించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గోస్పాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో అమానుల్లాను కోరారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్యదర్శులను ఉదయం 6గంటలకే హాజరు కావాలని చెప్పడంతో ఇబ్బందులు పడుతున్నామ న్నారు. గ్రామాల్లో పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు నెలనెలా వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఐవీఆర్ఎస్ సర్వే డీడీవోల నుంచి తమను తొలగించాలని కోరారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ప్రసాద్, వెంకటేష్‌నాయక్, జ్యోతి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శిశుసంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నందికొట్కూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు స్త్రీ శిశుసంక్షేమ శాఖ పరిధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీవో మంగవళ్లి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి మండలంలోని జానాల గూడెం ఎస్టీ కోటాలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, నందికొట్కూరు, మిడ్తూరు, పగిడ్యాల, కొత్తపల్లి మండలా ల్లోని అంగన్‌వాడీ ఆయాలు 7 పోస్టులు నియామకాలకు అర్హులైన నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు ఆమె తెలిపారు. నందికొట్కూరు లోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు (బీసీ-సీ), మల్యాల-3 (బీసీ-ఎ), మిడ్తూరు మండలంలోని సున్నంపల్లిలో (ఈడబ్ల్యూఎస్), మాసాపేట(ఓసీ), పగిడ్యాల మండలంలోని ప్రాతకోట-4 (ఓసీ), లక్ష్మాపురం-1(బీసీ-డి), కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల-2 అంగన్‌వాడీ కేంద్రంలో (ఎస్సీ గ్రూప్3) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుట్లు ఆమె తెలిపారు. మినీ అంగన్‌వాడీ ఆయా కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 2024 జూలై 1వ తేదీ నాటికి 21ఏళ్లు నిండి 35 సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులని తెలిపారు. అభ్యర్థి తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలని, స్థానిక నివాసితురాలై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ జనావాస ప్రాంతాలలో అభ్యర్థినులలో 21 ఏళ్లు నిండిన వారు లేనిచో దిగువ వయస్సు 18 ఏళ్లు నిండిన వారు అర్హులని చెప్పారు. జూలై 1వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కార్యాలయంలో దర ఖాస్తు లను సమర్పించాలని సూచించారు.

ఆశా వర్కర్ పోస్టుకు..

కొత్తపల్లి: ఎర్రమఠం గ్రామ పంచాయతీలోని జానాల గూడెంలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎర్రమఠం పీహెచ్‌సీ వైద్యాధికారి జుబేర్ తెలిపారు. జానాలగూడెం చెందిన వారై ఉండి ఆ ఊరి కోడలై ఉండాలని చెప్పారు. పదో తరగతి పాసై ఉండాలని, ఒకవేళ ఆ గ్రామంలో పదో తరగతి పాసైన వారు లేనిపక్షంలో ఫెయిల్ అయిన వారు కూడా దర ఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళ వయస్సు 25 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. జూలై 2వ తేదీలోపు ఎర్రమఠం పీహెచ్‌సీలో దరఖాస్తు ఫారం అందజేయాలని వైద్యాధికారి కోరారు.

ఆశలు ఆవిరి

- కరుణించని వరణుడు
- వర్షాలు లేకపోవడంతో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాత


పాములపాడు శివారులో ఎండు దశలో మొక్కజొన్న పంట

పాములపాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ తీపి కబురుతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రుతుపవనాలు ముందుగానే రాష్ట్రాన్ని తాకడంతో తొలకరి జల్లులు కురిశాయి. దీంతో రైతులు సాగుకు సిద్ధం అయ్యారు. పొలాలు సేద్యాలు చేసి మొక్కజొన్న పంటసాగు చేశారు. ముందస్తు వర్షాలు మురిపించిన గత 25 రోజులు క్రితం నుంచి వరుణదేవుడు కరుణించలేదు. ఎండలు మండుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయి దీంతో రైతులు ఈ ఖరీఫ్ మొదటిలోనే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రుద్రవరం, జూటూరు, చెలిమిళ్ళ, లింగాల, మిట్టకందాల, బానకచెర్ల, వేంపెంట తదితర గ్రామాల్లో దాదాపు 1500 హెక్టార్లలో మొక్కజొన్న, 200 ఎకరాలలో పత్తిపంట, సోయబీన్ పంటలను సాగుచేశారు. ఎకరాకు విత్తనాలు, ఫర్టిలైజర్, పురుగుమందులు కూలీఖర్చులు దాదాపు పదివేల రూపాయలు పెట్టుబడులు వెచ్చించామని, కౌలు కూడా చెల్లించామని, ప్రతి ఏడాది ఏదో ఓ రూపంలో రైతులు నష్టపోయి అప్పులపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూపులు

మండలంలో జూన్ మొదటి వారంలో ప్రతి ఏడాది ప్రధానంగా మొక్కజొన్న పంటను దాదాపు ఐదువేల హెక్టార్లలో సాగుచేస్తారు. అలాగే పత్తి, సోయాబీన్, కందులు, తదితర పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో 15శాతం మంది రైతులు పంటలను సాగుచేశారు. మిగతా 85 శాతం రైతులు తమ పొలాలో విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధంగా ఉంచుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు ఆలశ్యం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి పంట ఎండిపోతోంది



పొలం కౌలుకు తీసుకొని రెండు ఎకరాలలో పత్తిపంట సాగు చేశా. కౌలు, పెట్టుబడులు దాదాపు నలభైవేల రూపాయలు పెట్టాం. వర్షాలు లేక పంటలు ఎండి పోతున్నాయి.
- బలరాముడు, రుద్రవరం

ఆరెకరాలకు రూ. లక్ష పెట్టుబడి పెట్టా



ముందస్తు వర్షాలు కురువడంతో ఆరు ఎకరాలలో మొక్కజొన్న పంటను లక్ష రూపాయల మేర పెట్టు బడి పెట్టి సాగుచేశా. వర్షాలు లేక పోవడంతో పంట ఎండి పోతోంది. నాలుగు రోజుల్లో పంటను దున్నేస్తున్నాను.
- మనోహర్‌గౌడ్, రుద్రవరం

పక్కా గృహాల మంజూరుకు కృషి

- దివ్యాంగులకు ఎంపీ బైరెడ్డి శబరి హామీ


నందికొట్కూరులో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

నందికొట్కూరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇంటి స్థలంతో పాటుగా పక్కా గృహాల మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా వారి పరికరాలను అందించేందుకు ఎంపిక కోసం ఎంపీడీవో సుబ్రమణ్యాశర్మ ఆధ్వర్యంలో సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అధిదిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు మూడు చక్రాల సైకిల్, వీల్ ఛైరు, చంక కర్రలు, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిల్, శ్రవణ పరికరాలు, అంధుల చేతి కర్రలు అందజేయనున్నట్లు తెలిపారు. రెండు సెంట్లు ఇప్పించాలని దివ్యాంగులు ఎంపీని కోరారు. దివ్యాంగులకు రెండు సెంట్లు ఇచ్చేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసు లుకు సూచించారు. ఆర్డీవో నాగజ్యోతి, మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకరెడ్డి, టీడీపీ నాయకులు పల్లె రఘురామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటస్వామి పాల్గొన్నారు.

పైపాలెం గ్రామం సందర్శన

మిడుతూరు: మండలంలోని పైపాలెం గ్రామాన్ని ఎంపీ శబరి శనివారం సందర్శించారు. ఎంపీ శబరితో గ్రామస్థులు మాట్లాడుతూ పైపాలెం గ్రామంలో జరుగుతున్న సోలార్ పనుల వల్ల తమ పొలాలకు వెళ్ల రహదారులు, నీటికుంటలు, పొలాల గెట్లు తొలగించడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. సోలార్ పనుల్లో బ్లాసింగ్‌లు చేయడం వల్ల గ్రామంలో ప్రజలు భయభ్రాంతులకు గురిఅవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎంపీ స్పందించి సోలార్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. సోలార్ పనుల్లో అనుమతులు లేకుండా ఎలా బ్లాస్టింగ్‌లు చేస్తారని, నిలిపివేయాలని అధికారులకు సూచించారు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య, సర్పంచ్ రామచంద్రుడు, టీడీపీ నాయకులు వెంకటస్వామి, నాగేశ్వరరావు, సీతారామి రెడ్డి, అంకిరెడ్డి, స్వామిరెడ్డి, గోకారి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


మోటారును ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని తాటిపాడు వద్ద ఉన్న జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకాన్ని శనివారం మోటారును ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ముందుగా కృష్ణమ్మకు చీర, సారె సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల మెట్టప్రాంతంలో సాగుచేసిన వర్షాధారపంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఎగువప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో శ్రీశైలం జలాశయానికి వరదనీరు రావడంతో రైతులకు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేసుకునేందుకు అవకాశం వచ్చిందని అన్నారు. నీటిని వృథా చేయకుండా పంటలకు వినియోగించుకోవాలని అన్నారు. జూపాడుబంగ్లా-1, 2 ఎత్తిపోతల నుంచి 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, రమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, పెద్దన్న, సుధాకర్, రవికుమార్‌యాదవ్, బాలమద్దిలేటి, మాజీ సర్పంచ్ లక్ష్మన్నగౌడు, రాముడు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తాపించాలి

బండిఆత్మకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు వాటి పిల్లల్లో నట్టల నివారణకు మందు తాపించాలని డాక్టర్ అనూష సూచించారు. మండలంలోని సంతజూటూరు గ్రామంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి గొర్రెలు, మేకలు, వాటి పిల్లలకు మందు తాపించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

కొత్తపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయట ఉన్న 9 నెలల చిన్నారిపై కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం ముసలిమడుగులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన విష్ణు, చిన్నారి దంపతుల కూతురు ఉదయం ఇంటి ముందు ఉన్న అరుగు వద్ద కూర్చోబెట్టి తల్లి చిన్నారి ఇంటిలోకి వెళ్లగా అంతలో ఓ కుక్క ఆ చిన్నారిపై దాడి చేసింది. దీంతో ఎడమ చేతి, చెవికి, ముక్కుకు తీవ్రగాయాలయ్యాయి. చిన్నారిని వెంటనే కుటుంబ సభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

వారంలోపు నీటి పన్నులు వసూలు చేయాలి

- ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

మిడుతూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చెరువుల కింద సాగు చేస్తున్న రైతుల వద్ద నీటి పన్నులు వారం రోజుల్లో వసూలు చేయాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి సూచించారు. మిడుతూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ తమ దగ్గరకు వచ్చిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గృహనిర్మాణ అనుబంధ పట్టాలు పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

రైతులకు మేలు చేయాలి


చైర్మన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డైరెక్టర్ విశ్వనాథరెడ్డి

నంద్యాల రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు మేలు చేయాలని కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ రెడ్డి కోరారు. శనివారం విజయవాడలో చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అధ్యక్ష తన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ బైరెడ్డి శబరి ఆలోచనలకు అనగుణంగా రైతులకు మేలు జరిగే విధంగా సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ నిర్ణయాలు ఉండాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా నంద్యాలలో ప్రొక్యూర్‌మెంట్ చేపట్టి గోదాములు తీసుకొని రైతుల ధాన్యం నిల్వలకు సహకరించాలని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ ద్వారా సివిల్ సప్లయాస్ గోడౌన్స్ అద్దెకు తీసుకొని చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. కర్నూలు కార్యాలయాన్ని అనంతపురానికి తరలించ కూడదని కోరారు. నాయకులు అజయ్, శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు

ఆత్మకూరురూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, భయాందోళన వద్దని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. శనివారం కరివేనలోని మానవతా నిలయం వృద్ధాశ్రమంలో 'టీబీ ముక్త్ అభియాన్'లో భాగంగా క్షయ నివారణపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు , వృద్ధులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలి

- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఫరూక్

నంద్యాల టౌన్ జూన్ 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. పట్టణంలోని మున్సిపాలిటీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి మాట్లాడుతూ అభివృద్ధికి సహకరించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొత్తగా వచ్చిన కమిషనర్ శేషన్నతో సిబ్బంది ఎలా ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ పట్టాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేశామని, ఇంకా కొన్ని తుది దశలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఏవైనా పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన డీఈ గురప్ప యాదవ్, టూటౌన్ సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ సురేశ్, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

- సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. శనివారం మెప్మా కార్యాలయంలో సీఆర్పీలకు ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించాలని సీఆర్పీలకు సూచించారు.

నంద్యాల రూరల్: సర్వ మానవాళి క్షేమం కోసం ప్రార్థించాలని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. పట్టణంలోని ఎన్టీఆర్ షాదీఖానా నుంచి శనివారం ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారితో ఆయన మాట్లాడారు. యాత్రను దిగ్విజయం చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్, ఆత్మకూరు మండల అధ్యక్షులు సాయి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు తమ హైస్కూల్ నిర్వహణకు అనుమతులు లేనప్పటికీ పాఠశాలలో అడ్మిషన్లు చేయించుకుని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోస గిస్తున్నారని ఆరోపించారు. లాభార్జనే ధ్యేయంగా ఇలాంటి చర్యలకు పాల్పడి పరీక్షల సమయంలో ఇతర విద్యా సంస్థల పేర్ల మీదుగా విద్యార్థులచే పరీక్షలు రాయిస్తున్నారని చెప్పారు. అలాంటి పాఠశాలలను విద్యాశాఖాధికారులు గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇలాంటి పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించవద్దని సూచించారు. సమావేశంలో నాయకులు అంజి, శివ తదితరులు ఉన్నారు.

పొద్దు తిరుగుడు సాగుపై శిక్షణ


ఆర్ఏఆర్ఎస్ వద్ద శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పొద్దుతిరుగుడు పంటపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట రమణమ్మ, డాక్టర్ రవిప్రకాశ్‌రెడ్డి జిల్లాలోని వ్యవసాయ విస్తరణాధికారులకు పొద్దుతిరుగుడు పంట సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణనిచ్చారు. అనంతరం ఖరీఫ్‌లో ఖరీఫ్‌లో పంటల విస్తీర్ణంపై చర్చించారు. ఏడీఆర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో 70వేల ఎకరాలకు పైగా శనగపంటను సాగు చేస్తారని, అయితే శనగకు ముందు రైతులు పొలాన్ని ఖాళీగా ఉంచకుండా కొర్ర, సోయాచిక్కుడు, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగుచేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్నలో కత్తెరపురుగు ఆశించిందని, నివారణ చర్యలను రైతులకు వివరించాలని వ్యవసాయ విస్తరణాధికారులను కోరారు. కార్యక్రమంలో డీడీ మద్దిలేటి, ఏడీఏ ఆంజనేయులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వన్ స్టాప్ సెంటర్ తనిఖీ


వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఏఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాబరాల్ మసీదులోని సఖీ వన్ స్టాప్ సెంటర్‌ను శనివారం ఏఎస్పీ యుగంధర్ బాబు తనిఖీ చేశారు. ఆయన వన్ స్టాప్ సెంటర్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా హింసకు గురైన మహిళలకు అవసరమైన సేవలు, బాధిత మహిళలకు న్యాయ, వైద్య సాయం అందించనున్నట్లు తెలిపారు. మహిళలకు హింస నుంచి రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాములు, ఉమెన్ అండ్ చైల్డ్ డైరెక్టర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధి పనుల పరిశీలన

మహానంది, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని గోశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆలయ ఏఈ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. గోవుల సంరక్షణ కోసం గోశాల చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు షెడ్‌లో ఫ్లోరింగ్ పనులను మెదటి విడతగా అభివృద్ధి పనులను ఈవో ఆదేశాల మేరకు చేపడుతున్నట్లు ఏఈ చెప్పారు. అర్చకుడు బెక్కెం శరభయ్యశర్మ ఉన్నారు.

భక్తుల రద్దీ


శ్రీశైలంలో దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

నంద్యాల రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రం శనివారం వేలాది మంది భక్త జనులతో కిటకిటలాడింది. క్షేత్రంలో వెలిసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. స్వామి, అమ్మ వార్లకు దేవస్థానం తరుపున జరిగిన నిత్యకైంకర్యాలలో భాగంగా అభిషేకాలు, అర్చనలు, నామార్చనలు భక్తి శ్రద్ధతో నిర్వహించుకున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన కళారాధన కార్యక్రమాలలో భాగంగా సాంస్కృతిక నృత్యకళా ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాజమహేంద్రవరం చెందిన సందీప్‌శర్మ ధర్మపథంలో భాగంగా దక్షిణామూర్తి వైభవం ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. భగవత్ సన్నిదానంలో ఆధ్యాత్మికం, భక్తిప్రబోధ ప్రవచనాలు వినిపించారు. ఆలయ దక్షిణ మాడవీధుల్లోని కళావేదిక వద్ద హరికథ, బుర్రకథ, సాంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీత భక్తి రంజనీ కార్యక్రమాలు నిర్వహించారు.

మహానంది: మహానంది క్షేత్రంలో వీకెండ్ సందడి కనిపించింది. తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు దర్శనం కోసం తరలి వచ్చారు. ముందుగా ఆలయం ప్రాంగణంలోని కోనేర్లతో పాటు రుద్రగుండం కోనేర్లల్లో భక్తులు కుటుంభ సమేతంగా పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరాలు సమర్పించారు నవనంది క్షేత్రాల్లోని వినాయకనంది, గరుడనందీశ్వరుని ఆలయాలను దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం వరకు క్షేత్ర పురవీధుల్లో భక్తుల సందడి కనిపించింది. ఆది, సోమవారాల్లో కూడా మహానందిలో మరింత భక్తుల రద్దీ కనిపించే అవకాశం ఉంది.


మహానంది: కోనేరులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

విద్యతోపాటు నైపుణ్యం సాధించాలి

శిరివెళ్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతోపాటు కళాశాలస్థాయిలోనే నైపుణ్యాభివృద్ధి సాధించాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి తెలిపారు. కళాశాలలో శనివారం ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. కళాశాలలో అన్నిరకాల కోర్సులు ఉన్నాయన్నారు. డిగ్రీ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు స్కిల్‌హబ్ ద్వారా వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

బేతంచెర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అంబాపురం గ్రామంలో గ్రామ శాఖ మహాసభలో భాగంగా సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రామాంజనేయులు, ఎన్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడి రాముడు, సంజీవులు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసు, శివయ్య, భార్గవ్, నారాయణ, సుబ్బారెడ్డి, నాగరాజు, ఉదయ్, తిరుమలేష్, డి.దస్తగిరి, పి.నాగరాజు, అంబాపురం గ్రామస్థులు నాగేశ్వరరావు, సోమన్న, శ్రీరాములు, నగేష్, భాస్కర్, సురేష్, తిమ్మయ్య పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలిస్తే ఉద్యమిస్తాం

డోన్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణ వెలుపలికి తరలిస్తే ఉద్యమిస్తామని ఆయా పార్టీల నాయకులు హెచ్చరించారు. కోర్టు రోడ్డులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఐటీఐ కళాశాల సమీపంలోని భవనంలోకి తరలిస్తున్నారన్న సమాచారంతో శనివారం డాక్యుమెంటు రైటర్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డాక్యుమెంటు రైటర్ల ఆందోళనకు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు మద్దతు పలికాయి. యథాస్థానంలోనే కార్యాలయాన్ని ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి, సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, సీపీఎం కమిటీ సభ్యులు చిన్న రెహిమాన్, నాయకులు మల్లెంపల్లె జనార్దన్, ఐద్వా నాయకురాలు షమీమ్‌భేగం పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులకు బదిలీలు సహజం

రుద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఫారెస్ట్ రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. రుద్రవరం రేంజర్‌గా పనిచేస్తూ అనంతపురం జిల్లా సోషల్ ఫారెస్టు రేంజర్‌గా బదిలీపై వెళ్లిన శ్రీపతినాయుడును శనివారం రేంజ్ కార్యాలయంలో సిబ్బంది పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా, మహబూబ్‌ఖాన్, శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు నరసింహారెడ్డి, సురేంద్రగౌడ్, నాగేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి రేంజర్‌గా ముర్తుజావలి

రుద్రవరం రేంజ్ ఇన్‌చార్జి రేంజర్‌గా ముర్తుజావలికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఫారెస్టు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న రేంజర్ శ్రీపతినాయుడు అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. అహోబిళం డిప్యూటీ రేంజర్‌గా పనిచేస్తున్న ముర్తుజావలికి ఇన్‌చార్జి బాధ్యతలు అధికారులు అప్పగించారు.

ప్రజలు శాంతియుతంగా జీవించాలి

రుద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలో ప్రజలు శాంతియుతంగా జీవించాలని ఎస్ఐ ఎస్ఎండీ రఫీ అన్నారు. శనివారం నంద్యాల నుంచి బదిలీపై వచ్చి రుద్రవరం పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వర ప్రసాద్ ఆళ్లగడ్డ రూరల్‌కు బదిలీపై వెళ్లారు.

పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి

రుద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రజలు సహకరించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కోటకొండ గ్రామంలో పారిశుధ్యం పనులు, పైపులైను లీకేజీలు, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. సచివాలయంను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

రీసర్వే డీటీగా మహ్మద్ హుసేన్

రుద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం రీసర్వే డిప్యూటీ తహసీల్దారు(డీటీ)గా మహ్మద్‌హుసేన్ శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. ఆయన నంద్యాల కలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చానన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

డోన్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి అన్నారు. 11 సంవత్సరాల బీజేపీ పాలన పూర్తయిన శుభ సందర్భంగా శనివారం కొత్తపల్లె, సీసంగుంతల, మల్యాల, బి.రామదుర్గం, యాపదిన్నె, ఓబులాపురం, రేకులకుంట, ఉంగరానిగుండ్ల గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, హెచ్‌కే హరి నాయుడు, ముదిరాజ్ లక్ష్మీనారాయణ, షేక్షావలి, కార్యకర్తలు ఉన్నారు.

యాగంటి ఈవోగా పాండురంగారెడ్డి

బనగానపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ ఈవోగా పాండురంగారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే బీసీ రాజారెడ్డిని కలిశారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేశ్‌బాబు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి, సాధుకొట్టం రామశేఖర్ పాల్గొన్నారు.

కారుబోల్తా - డ్రైవర్‌కు గాయాలు

బనగానపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప నుంచి గులాంనబీపేటకు వెళ్లే మార్గంలో శనివారం కారు బోల్తా పడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. నంద్యాల పట్టణం ఎన్‌జీవో కాలనీకి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్తుండగా ఈప్రమాదం సంబవించింది. కారులో డ్రైవర్ మాత్రమే ఉండంతో పెద్ద ప్రమాదం తప్పింది.

'సూర్యఘర్'పై అవగాహన కల్పించండి

● ఎస్ఈ సుధాకర్ శర్మ

డోన్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధాకర్‌శర్మ అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని, బిల్లు తక్కువగా వస్తుందని అవగాహన కల్పించి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీని వినియోగించుకునేలా చైతన్య పరచాలన్నారు.

సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా ఎల్లగౌడు?

డోన్ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డోన్ మండలం సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా చిన్నపూజల్ల ఎల్లగౌడ పేరు దాదాపు ఖరారైంది. ఆయనతో పాటు మం డలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన గొల్ల సుంకన్న, గోసానిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున సొసైటీ మెంబర్లుగా దాదాపు ఖరారైనట్లు తెలిసింది. దీంతో అధికారికంగా నేడో, రేపో ప్రభుత్వం ప్రకటన చేయాల్సి ఉంది.

నాటి తప్పులకు.. నేడు తిప్పలు

- రీసర్వేలో భూమి కొలతల్లో తేడాలు
- అన్నదాతలను వెంటాడుతున్న కష్టాలు
- పెద్ద సమస్యగా జాయింట్ ఎల్‌పీఎంలు
- సరి చేసుకునేందుకు అవకాశం



నేలంపాడులో రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ (ఫైల్)

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే చేపట్టిన సమయంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా గడువు విధించి సర్వే పూర్తి చేయించారు. తప్పులు లేకుండా చేయాల్సిన రీసర్వేలో అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఒక సర్వే నంబర్‌లో సబ్‌డివిజన్ కింద భూమి ఉన్నప్పుడు కొత్తగా చేసే రీసర్వేలో కూడా ఆ భూమికి సబ్‌డివిజన్ చేసి ఎల్‌పీఎం నంబర్ కేటాయించాలి. కానీ కొన్నిచోట్ల అలా జరగలేదు. ఒక సర్వే నంబర్‌లోని రైతు రీసర్వే సమయంలో రాకపోతే ఆ సర్వే నంబర్‌లోని సబ్‌డివిజన్‌లను అన్నింటిని కలిపి ఒక జాయింట్ ల్యాండ్ పార్సల్ కిందకు తీసుకొచ్చేశారు. ఈ తప్పును ఆ తరువాత సరి చేశారా అంటే అదిలేదు. రైతులు గగ్గోలు పెట్టిన గత ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడే లేడు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ సదస్సు నిర్వహించింది. ఇక్కడ రీసర్వేకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా రావడంతో మరోసారి రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించారు. అప్పుడు కూడా రీసర్వేలో జరిగిన తప్పులను సరి చేయాలంటూ రైతుల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు వచ్చాయి. ఏడాది కాలంలో ఒక్క సర్వేశాఖకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వచ్చాయి. నంద్యాల డివిజన్ పరిధిలో 13,500 అర్జీలు నమోదు కావడం గమనార్హం. ఆళ్లగడ్డ పరిధిలో చాగలమర్రిలో 939, దొర్నిపాడులో 520, రుద్రవరంలో 1176, శిరివెళ్లలో 743, ఉయ్యాలవాడలో 955, ఆళ్లగడ్డలో 426 ఎల్‌పీఎంలు ఉన్నాయి. 11 వేల ఎల్‌పీఎంలు వచ్చాయి. జాయింట్ ల్యాండ్ పార్సిల్ (ఎల్‌పీఎం) సమస్యలే కాకుండా భూ విస్తీర్ణంలో తేడాలు వచ్చిన కేసులు కూడా వేలల్లో ఉ న్నాయి. వీటన్నింటి పరిష్కారానికి ప్రభుత్వం గైడ్‌లై న్సను రూపొందించింది. ఎల్‌పీఎం నుంచి సబ్ డివిజన్ చేయలంటే జాయిల్ కలెక్టర్ స్థాయి వరకు ఫైల్ తీసుకెళ్లాల్సి రావడంతో రైతులకు సమస్యలు పరిష్కారమయ్యేవి కావు. దీంతో రెవెన్యూ అధికారులు కూడా సమస్య పరిష్కరిం చకుండానే వచ్చిన అర్జీ లను క్లోజ్ చేస్తూ వచ్చారు. దీంతో రైతులు భూ సమస్య పరి ష్కారం కాక అవస్థలు పడ్డారు.

సబ్‌డివిజన్‌కు అవకాశం కల్పించిన ప్రభుత్వం

భూరీసర్వేలో సబ్‌డివిజన్ జరుగకుండా ఇబ్బందులు పడుతున్న రైతులు లక్షల్లోనే ఉండటంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాయింట్ ల్యాండ్ పార్సిల్ నుంచి సబ్‌డివిజన్ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గతంలో మాదిరిగా కాకుండా ఈ సబ్‌డివిజన్ ప్రక్రియ సర్వేయర్ స్థాయిలోనే పూర్తి చేసేలా నిర్ణయించారు. ఇందుకు దరఖాస్తు రుసుము రూ.500 ఉండగా దాన్ని రూ.50 తగ్గించారు. సబ్ డివిజన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులు స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని సమస్య ను పరిష్కరించుకోవాలని జేసీ, ఆర్డీవో సూచించారు. జిల్లాలో రెండో విడతలో పైలెట్ ప్రాజెక్టుగా 29 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో రీసర్వేను మొదలు పెట్టారు.

ఏడాది నుంచి తిరుగుతున్నా..



ఆన్‌లైన్ సమస్య గురించి ఏడాది నుంచి తిరుగుతున్నా పరిష్కారం కాలేదు. 832, 835 సర్వే నంబర్లలోని భూమి సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. రెడ్‌మార్క్‌లో ఉంచారు. ఆన్‌లైన్ చేయాలని దరఖాస్తు చేసుకున్న సమస్యను పరిష్కరించడం లేదు.

- పకీర్‌బాష, రైతు, చాగలమర్రి

ఇబ్బంది పడుతున్నాం



భూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదు. తన కు 561/3 సర్వేనంబర్‌లో 1.95 ఎకరాల పొలం ఉంది. ఆన్‌లైన్ చేయాలని దరఖాస్తు చేసుకున్న. ఆరు నెలలైనా సమస్య పరిష్కారం కాలేదు.

- కృష్ణనాయక్, రైతు, కేపీ తండా

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

రైతుల భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. చుక్కల భూముల దరఖాస్తులను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిస్తున్నాం. సబ్‌డివిజన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం.

● విజయ్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం: మంత్రి



బాధితకుటుంబానికి ఎల్‌వోసీని అందిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేదలపాలిట సీఎం రిలీఫ్‌ఫండ్ వరంలాంటిదని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అవుకు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన సీ.పెద్దసుబ్బయ్య భార్య రామలక్ష్మమ్మకు మంజూరు అయిన రూ. 9.5 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును మంత్రి అందించారు. వెంకటసుబ్బయ్య గతంలో తీవ్ర అనారోగ్యానికి గురై వైద్యంపొందుతూ మృత్యువాత పడ్డారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వేళ బాధిత కుటుంబానికి సీఎంసహాయనిధి ద్వారా అందించే సాయం అండగా ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి బీసీని కలిసిన విజయభట్టు

డోన్ టౌన్: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, సంజామల మండల అబ్జర్వర్ విజయభట్టు శనివారం కలిశారు. ముందుగా మండలంలోని టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 2నుంచి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిన సంక్షేమాలను, అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని తెలిపారు. పార్టీలో కార్యకర్తలే పట్టుగొమ్మలు అని, పార్టీ కోసం పని చేస్తున్న ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామని, ఎవరూ నిరుత్సాహ పడొద్దన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

- బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల సంస్థాగత అబ్జర్వర్ నటేశ్ చౌదరి



మాట్లాడుతున్న నటేశ్ చౌదరి

కోవెలకుంట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా పేదలకందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని బనగానపల్లె నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్ నటేశ్ చౌదరి అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సంజామల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు, బనగానపల్లె మండలాలకు చెందిన బూత్ కన్వీనరు, క్లస్టర్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నటేశ్ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో బనగానపల్లె మండల ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, మాదన్న(కొలిమిగుండ్ల), విజయ్ (సంజామల), చిన్న నాగేశ్ (కోవెలకుంట్ల), సిద్దిసత్యనారాయణ (అవుకు), బనగానపల్లె నియోజకవర్గ అబ్జర్వర్ ముంతాజ్, నాయకులు మంచాల మద్దిలేటిరెడ్డి గువ్వల సుబ్బారెడ్డి, నంద్యాల రామేశ్వర్‌రెడ్డి, కలుగొట్ల అర్జున్‌రెడ్డి, విష్ణుశేఖర్‌రెడ్డి, వల్లంపాడు జగదీశ్వర్‌రెడ్డి, బిజినవేముల హుసేనయ్య బుచ్చన్న, బాలరాజు, లింగాల నాయుడు, పెనుగొండ శేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన



రుద్రవరం మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

రుద్రవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని శనివారం రుద్రవరం మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ ఏపీ పంచాయతీరాజ్ శాఖలో ఉన్నతాధికారుల అత్యుత్సాహం ఆ శాఖ ఉద్యోగుల్లో కలకలం రేపుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 7గంటల్లోపు వారి పరిధిలోని చెత్త సేకరణ కార్యక్రమం పర్యవేక్షించి ఆ ఫొటోలను పై అధికారులకు పంపాలన్నారు. ఇలా పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు రామక్రిష్ణ, ఏ.పాములేటి, జి.పాములేటి, షాహినూర్, ప్రభాకర్, ఆదిలక్ష్మి, అరవింద్‌నాయక్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పనిఒత్తిడి తగ్గించాలి

ప్యాపిలి: విధి నిర్వాహణలో పని ఒత్తిడి తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పంచాయితీ కార్యాలయాల్లో సరిపడ సిబ్బంది లేకపోయిన పనులు మాత్రం తప్పక చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తున్నాయని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.

బాలికకు నగదు పురస్కారం



విద్యార్థిని మనీషాకు ఆర్థిక సాయం అందిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె/కొలిమిగుండ్ల జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కొలిమిగుండ్ల మండలం విద్యార్థిని మనీషాకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి రూ.20వేలు నగదు బహుమతిని శనివారం అందించారు. కొలిమిగుండ్లకు చెందిన అంకిరెడ్డిపల్లెకు చెందిన మనీషాను మండల టాపర్‌గా తొలుత భావించారు. కాని కొలిమిగుండ్ల ఏపీ మోడల్‌స్కూల్ చెందిన కళ్యాణ్‌బాబుకు రీవ్యాల్యుయేషన్‌లో 581 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్ల ఈ సమాచారం తెలియలేదన్నారు. దీంతో ఇద్దరు విద్యార్థులు బనగానపల్లెలో నిర్వహించిన నగదు పురస్కారం కోసం కార్యక్రమానికి వచ్చారు. మనీషా ప్రతిభా పురస్కారం అందుకోలేక పోయారు. బీసీ రాజారెడ్డి స్పందించి రూ.20వేలు ఆర్థిక సాయం మనీషాకు అందించి ఉన్నత విద్యను అభ్యసించేందుకు సాయం అందించారు. మనీషాకు ఇడుపుల పాయలో ట్రిపుల్‌ఐటీ సీటు రావడంతో ఆబాలికను బీసీ రాజారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అహోబిలం టోల్‌గేట్ వేలం

ఆళ్లగడ్డ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శనివారం గేట్ వేలం నిర్వహించారు. దేవస్థానం టోల్ గేట్ వేలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన సానే వంశీ రూ. 21 లక్షలకు గేటు సవాలు పాడి దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే పది శాతం అధికంగా పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మార్పీస్ జెండానే మాదిగలకు అండ ..

కోవెలకుంట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీస్ జెండానే మాదిగలకు అండగా నిలుస్తుందని ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు ఇరికమాను నాగేశ్వరరావు మాదిగ, పెద్ద మునయ్య మాదిగ అన్నారు. శనివారం పట్టణంలో గడప గడపకూ దండోరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మాదిగ సోదరుడి ఇంట ఎమ్మార్పీస్ జెండా ఎగురవేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బోడెమ్మనూరు రాజు, విజయ్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

దొర్నిపాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ పరిధిలో సాగు చేస్తున్న పంట పొలాలకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేసీకెనాల్ డీఈ రవీంద్ర అన్నారు. శనివారం మండలంలోని 21 లాక్ నుంచి 27 లాక్ వరకు కేసీ కెనాల్‌లో పూడికతీత పనులు చేయిస్తున్నామన్నారు. పూడికతీత పనులు చేయడం వలన చివరి ఆయకట్టు వరకు సాగునీరు సక్రమంగా రైతులు వినియోగించుకోవచ్చని తెలిపారు. రైతులు నీటిని వృథా చేయరాదని సూచించారు. పూడికతీత పనులను ఎక్స్‌కవేటర్‌తో చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ స్వామి రంగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఈవ్‌టీచింగ్, శక్తియాప్‌లపై అవగాహన

బనగానపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి ఈవ్‌టీచింగ్, శక్తియాప్‌లపై అవగాహన కల్పించారు. మహిళలకు సంబంధించిన సమస్యలపై చిన్నతనం నుంచే తెలుసుకోవాలన్నారు. ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోక్సో చట్టం తదితర వాటిని గురించి, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం ప్రసాదరావు, టీచర్ శ్రీనివాసరెడ్డి, బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాములోరి గుడిలో ప్రత్యేక పూజలు

డోన్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రాములోరి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, మహా మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, గ్రామ టీడీపీ నాయకులు, మండల కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల కోరారు. శనివారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, సీఆర్పీలు, ఐఈఆర్టీలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ జూలై 12వ తేదీ లోపు బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. మండలంలో 650 మంది పిల్లలు బడిబయట ఉన్నారని, ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించి బడిలో చేర్పించేలా చూడాలని అన్నారు. సమావేశంలో కార్యక్రమంలో హెచ్‌ఎం జీవయ్య, సూపర్‌వైజర్ సుశీల, సీఆర్పీలు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు విరాళం

బేతంచెర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్లగుట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కర్నూలు చెందిన ఘనశ్యామ్ గ్రానైట్స్ అధినేత కారపాకుల సురేష్ గుప్తా కుర్చీలను విరాళంగా ఇచ్చారు. సురేష్‌గుప్తాకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మద్దిలేటి రెడ్డి, కృష్ణయ్య, శివకుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

జీవాల ఆరోగ్యమే లక్ష్యం

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల సంరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పశువైద్యులు దీపకుమారి, రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నగల్లపాడు గ్రామంలో గొర్రెలు, మేకలకు డివార్మింగ్ మందు తాపించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్ తెలిపారు. శనివారం చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు ద్విచక్రవాహనాలు నడపరాదని, వాహనాలు పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట హెచ్‌సీ వెంకట్‌రెడ్డి, పోలీసులు ఉన్నారు.

వీవోఏలను తొలగించడం సరికాదు

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు, తోడెండ్లపల్లె గ్రామాల్లోని వీవోఏలను తొలగించడం సరికాదని పొదుపు సంఘా సభ్యులు అన్నారు. శనివారం వీవోఏలతో కలిసి పొదుపు సంఘాల సభ్యులు ఆందోళన చేశారు. గ్రామాల్లో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎటువంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా సెర్ప్ సైట్‌లో పేర్లు తొలగించడం అన్యాయం అన్నారు. అలాగే తోడెండ్లపల్లె గ్రామంలో శ్రీలక్ష్మి, వెంకటేశ్వర పొదుపు సభ్యులకు తెలియకుండానే గ్రూపును తొలగించారని వాపోయారు. ఏపీజీబీలో రూ.10 లక్షలు రుణం కూడా తీసుకున్నామన్నారు. ఎటువంటి ఆరోపణలు లేకున్నా వీవోఏలను, పొదుపు సంఘాన్ని తొలగించడం అన్యాయమన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, మూడురాళ్లపల్లె రహదారిలోగల అభయాంజనేయస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి వ్రతం, భజన కార్యక్రమాలు చేశారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సామూహిక వడిబియ్యం సమర్పణ

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీ మహిళలు ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి చీర, సారె, సామూహిక వడిబియ్యం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శాకంబరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ భవానిదేవి, ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి నవతాప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

చాగలమర్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ అన్నారు. శనివారం చాగల మర్రి వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో అన్నదాత సుఖీభవ కోసం 9,800 మంది రైతులను గుర్తించామన్నారు. ఇంకా 250మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఈకేవైసీ చేయించుకుంటే అర్హులుగా గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కోవెలకుంట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌదరదిన్నెలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో వర ప్రసాదరావు శనివారం పరిశీలించారు. అలాగే సచివాలయం, వ్యవసాయ ఉత్పత్తుల కార్యాలయం వద్ద ఉన్న చెత్తను తొలగిస్తున్న పనులు పరిశీలించి ఫొటోయాప్‌లో అప్‌లోడ్ చేశారు.